

# అక్కడే ఆగక

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

"**అతను సిరియన్.** ప్రపంచంలోని అతి పురాతన నగరమైన డమాస్కస్‌లో పుట్టి పెరిగాడు. అక్కడ ఇంజనీరింగ్ చేసి మా కంపెనీలో చేరాడు. జోర్డాన్‌నించి ఇక్కడికి బదిలీమీద ఏడాది క్రితం వచ్చాడు. మేమిద్దరం దాదాపుగా ఒకేసారి వచ్చాం. అతని వ్యక్తిగత జీవితం బాలేదు. సిరియన్నే పెళ్ళి చేసుకున్నాడు. వారికో కొడుకు. పేరు ఇక్బాల్. ఆమెకి టకరోడీ నచ్చలేదు. వచ్చిన రెండో నెలనించే వేరే చోటికి బదిలీ చేయించుకోమని అతన్ని సతాయించసాగింది. కాని అతను పని చేయాల్సింది అలెక్సీల ఆఫ్‌షోర్‌లోని రిగ్‌లో. అది ప్రస్తుతం ఆపరేషన్‌లో ఉన్నది ఇక్కడే కాబట్టి కంపెనీ అతన్ని ఎక్కడికీ బదిలీ చేయలేదు."

"ఎందుకు బదిలీ అడిగింది?"

"ఇక్కడ తనకి సరిపడే సొసైటీ కాని, సోషల్ లైఫ్ కానీ లేదని. ఓసారి నాకు పేరిస్‌లో కొన్న చాలా డ్రస్‌లని చూపించి అవన్నీ వృథా అవుతున్నాయని, వాటిని వేసుకుని ఎక్కడికి వెళ్ళాలని అడిగింది. ఆమెకి లైఫ్‌ని ఎంజాయ్ చేయాలని కోరిక. ఇక్కడ భాషా, మతం వేరు. ఇక్కడంతా క్రిస్టియన్స్. ఆమెకి వారంటే పడదు. ఖాలెద్ మాత్రం రెలిజియస్ కాదు. ముస్లిమే ఐనా రోజూ నమాజు చెయ్యడు. శుక్రవారం మసీదుకి వెళ్ళడు. రంజాన్‌లో పాటించాల్సినవేం పాటించడు. పోర్క్ కూడా తింటాడు. హలాల్ మీటా కాదా అన్నది కూడా చూడడు. ట్రూ ఇంటర్నేషనల్ సిటిజన్‌గా మారాడు. మనకి అమెరికా పిచ్చి ఎలా ఉందో సిరియన్స్‌కి అలా జర్మనీ పిచ్చి ఉంటుంది. ఎక్కువమంది సిరియన్స్ జర్మనీకి వలస వెళ్తుంటారు. ఆమె చెల్లెలు జర్మనీలో సెటిలైంది. అదో అసూయ. పోటీగా తనూ అక్కడికే వెళ్ళాలని కోరిక. కాని జర్మనీలో మా బ్రాంచ్ లేదు.  ఆమె ఎన్నిసార్లు అడిగినా అది కుదరదనే చెప్తూ వస్తున్నాడు. తను ఘానాలో చిక్కుపడిపోయాననే మనస్థాపం మొదలైంది. పుట్టింటికి స్వదేశానికి వెళ్ళి అక్కడే అలెప్పో నగరంలో బిడ్డని కన్నది. కొడుక్కి ఇక్కడేదో జబ్బు చేస్తే సరైన వైద్యం అందలేదు. చచ్చిబతికాడనే చెప్పాలి. ఓసారి ఆమె చెల్లెలు తన పుట్టినరోజుకి ఆహ్వానిస్తే అంతా ఫ్రాంక్‌ఫర్ట్‌కి వెళ్ళారు. తీరా అక్కడికి వెళ్ళాక ఇక తను ఘానాకి ఎప్పటికీ రానని, జర్మనీలోనే ఉండిపోతానని ఖరాకండిగా చెప్పింది. అతన్ని కూడా అక్కడే వుండి తనలా పి.ఆర్, అంటే పర్మనెంట్ రెసిడెన్సీకి అప్లై చేసి ఏదో ఉద్యోగంలో చేరమని

కోరింది. అతనికి తను చేసే జాబ్ బాగా ఇష్టం. అదీకాక సిరియా టెర్రరిస్ట్ కంట్రీ కాబట్టి వారికి అంత త్వరగా ఉద్యోగాలు దొరకవు. ఆమెని వెనక్కి రమ్మని బతిమాలాడు. కాని ససేమిరా అన్నది. ఒక్కడే తిరిగి వచ్చాడు."

"అరె పాపం! ఆమె మళ్ళీ రానేలేదా?"

"ఊహు ఎప్పటికీ రాదు. విడాకులు కూడా తీసేసుకుంది. అతనికి తన కొడుకంటే ప్రాణం. వాడిని మిస్సవుతున్నానని బాధ పడుతూంటాడు."

"క్రిస్ లానే అన్నమాట. అరె పాపం. చిత్రంగా దేశం కోసమా విడాకులు?"

"అవును. అతని ట్రాజెడీ లైఫ్‌లో ఇదో చాలా చిన్న విషయం. అతని మాటల్లో 'డీక్లటర్ యువర్ లైఫ్. ఎవరు ఇంక అవసరం లేదో వారిని మీ జీవితంలోంచి తొలగించాలి ' అన్నాడు."

"డీక్లటర్ యువర్ లైఫ్. ఈ ఫిలాసఫీ నాకు నచ్చింది" ఆద్య వెంటనే చెప్పింది.

"అసలు బాధలు అతను సిరియన్ అవడంవల్ల పడుతున్నాడు."

"నాకు అర్థం కాలేదు."

కారు ఓ పెద్ద ఇంటి గేట్ ముందు ఆగింది. దాని వాచ్‌మేన్ కారులో ఎవరున్నారో చూసి గేట్ తెరిచాడు. ఆద్య తలుపు దగ్గర నిలబడ్డ స్ఫురద్రూపైన ముప్పై ఐదేళ్ళ యువకుడిని చూసింది. ఇద్దరూ దిగాక అతను పలకరింపుగా వారిని హగ్ చేసుకుని చెప్పాడు.

"వెల్‌కమ్ చైత్రా. నువ్వు చెప్పక, మీ చెల్లెలు కదా?" ఖాలెద్ నవ్వుతూ అడిగాడు.

"అవును. ఆద్య. ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్."

"పోలికలు స్పష్టంగా తెలుస్తున్నాయి."

అంతా లోపలకి వెళ్ళారు. సోఫాలో కూర్చున్నాక చైత్ర అడిగింది.

"ఏమైపొయ్యావు?"

"ఈసారి పర్మిషన్ రావడానికి కొద్దిగా ఆలస్యమైంది. కొద్దిగా ఎక్కువ ఖర్చైంది కూడా."

"నువ్వు డమాస్కస్‌కి వెళ్ళడం ఇక ఆపేయాలి. ఎలాగొలాగా మీ నాన్నగారినే పిలిపించుకోవచ్చుగా?" చైత్ర కోపంగా అడిగింది.

"ఆయనకి నేను, మా సిస్టర్స్ చాలాసార్లు చెప్పి చూసాం. వింటేనా? స్వంత ఊరు కన్నతల్లని చెప్తారు. పుట్టిన గడ్డమీదే మట్టై పోవాలని ఆయన కోరిక. తను నమాజు చేసే మసీదంటే ఆయనకి ప్రాణం. సంథింగ్ టు డ్రింక్? నువ్వు వైన్ తప్ప ఇంకేం తాగవని నాకు తెలుసు. లెట్ మీ సీ. ఉందో, లేదో..."

"నో. నేను మర్నాడు వర్కింగ్ డే ఐతే తాగను. ఓన్లీ వీకెండ్స్."

"ఐ విల్ గెట్ యు టిపికల్ సిరియన్ డ్రింక్."

ఇద్దరూ అతనితోపాటు లేచి ఫ్రిజ్ దగ్గరకి వెళ్ళారు. అతను ఫ్రిజ్ తలుపు తెరచి లోపలకి చూస్తూ చెప్పాడు.

"షరాబ్ వార్ద్ ఉంది .అది రోజ్ వాటర్‌తో చేస్తారు. లేదా జెలాబ్... డేట్స్ మొలాసిస్‌తో చేస్తారు."

"జెలాబ్" ఆద్య కోరింది.

"ఐ విల్ ట్రై షరాబ్ వార్ద్" చైత్ర కోరింది.

వాటిని రెండు గ్లాసుల్లో పోసి సీసాలోని చిల్లుల మూతలోంచి పైన్ నట్స్ ముక్కలని జెలాబ్ మీద చల్లి ఇచ్చాడు.

"అక్కా నీకు ఎంగిలి కాకపోతే నేను టేస్ట్ చేస్తాను" ఆద్యా కోరింది.

చైత్ర ఇచ్చిన గ్లాస్‌ని అందుకుని ఓ గుక్క తాగి చెప్పింది.

"ది రూ హబ్జా! నాన్న సమ్మర్‌లో తెచ్చేవారు."

ఫ్రిజ్ తలుపు మూసాక దానికి మేగ్నెట్‌తో అతికించిన వివిధ వయసులోని పిల్లవాడి ఫోటోని చూసింది. ఆద్య దాన్ని చూడటం గమనించి ఖాలెద్ చెప్పాడు.

"ఇది తీసినప్పుడు ఇక్బాల్ వయసు మూడున్నర."

ముగ్గురూ మళ్ళీ సోఫాలో కూర్చున్నాక చైత్ర చెప్పింది.

"ఇది చాలా రుచిగా ఉంది. థాంక్స్ ఖాలెద్. ఐ యాం క్యూరియస్. నువ్వు సిరియాకి వెళ్ళినప్పటినించి తిరిగి వచ్చేదాకా జరిగింది చెప్పు."

"డమాస్కస్ ఏర్‌పోర్ట్‌లో విమానం దిగాక మా ఇమిగ్రేషన్ అధికారి ఎప్పటిలానే 'నేను ఎన్నడైనా మిలటరీ సర్వీస్ చేసానా?' అని అడిగాడు. లేదంటే సిరియాలో నా అడ్రస్, ఫోన్ నంబర్లని అడిగి రాసుకుని, నా పాస్‌పోర్ట్ తీసుకుని, నన్ను సమీప మిలటరీ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయమని కోరాడు. మా డ్రైవర్ పోయి రెండు నెలలైంది. మా నాన్నగారు డ్రైవ్ చేయలేరు. దాంతో టేక్సీలో ఇంటికి చేరుకున్నాను. హోం!స్వీట్ హోం!ఎట్ లాస్ట్" నవ్వాడు.

"తర్వాత?"

"అదే కథ. మా నాన్నగారిని ఏన్యువల్ చెకప్‌కి తీసుకెళ్ళాను. బార్బెక్యూ మెషీన్‌ని శుభ్రం చేసి, కట్టెలు, బొగ్గు కొనుక్కొచ్చి ఆయనకి ఇష్టమైన రిబ్స్, స్టేక్‌లని చేసాను. రోజూ ఫోన్‌లో మాఅక్కలతో, వారి పిల్లలతో వీడియో కాల్‌లో మాట్లాడాం. ఆయన్ని జర్మనీకి వెళ్ళి అక్కలతో ఉండమని నచ్చచెప్పే ప్రయత్నం చేసాం. ఊహూ. వింటేనా? తర్వాత అది జరిగింది."

"వచ్చారా?" చిత్ర అడిగింది.

"మర్నాడు మా ఇంటిముందో మిలటరీ వేన్ వచ్చి ఆగింది. ఓ లెఫ్టినెంట్ నన్ను పావుగంట ప్రశ్నించి నా క్వాలిఫికేషన్, ఏం చేస్తున్నాను మొదలైనవి అడిగి తెలుసుకున్నాడు. 'సిరియా ప్రమాదంలో పడితే ఈ దేశపౌరుడిగా దేశానికి ఎందుకు దూరంగా ఉంటున్నాను? నాకు దేశభక్తి లేదా?' అని గదమాయించాడు. మర్నాడు నన్ను హెడ్ క్వార్టర్స్‌కి మెడికల్ టెస్ట్ కి రమ్మని నోటీస్ మీద సంతకం చేయించుకుని వెళ్ళాడు."

అతను చెప్పేది అక్క చెల్లెళ్ళిద్దరూ వింటున్నారు.

"మా నాన్నగారు కొన్ని ఫోన్ కాల్స్ చేసారు. కాని మాకు తెలిసిన మిలటరీ పేనల్ డాక్టర్ ఊళ్ళో లేడు. దాంతో ఆయన చెప్పిన మరో డాక్టర్ దగ్గరకి వెళ్తే నాకు వెన్నెముక సమస్య వుందని, ఎక్సర్‌సైజు చేసేప్పుడు ట్రైనర్ నన్ను బలంగా వంచడంతో బేక్ ఇంజురీ అయిందని సర్టిఫికేట్ ఇచ్చాడు. ప్రతీసారీ ఇచ్చేదే. కాని పూర్వం మా డాక్టర్ ఏ వెన్నుపూస దగ్గర అది జరిగిందని చెప్పాడో దాన్ని మెన్షన్ చేయక డిజెబిలిటీ సర్టిఫికెట్‌లో ఇంకోటి రాసాడు. దాన్ని మిలటరీ డాక్టర్ పట్టుకున్నాడు. మా డాక్టర్ తన సెక్రటరీ తప్పు టైప్ చేసిందని, అది టైపో ఎర్రర్ అని, నా ఎక్స్‌రేగా చెప్పబడే ఆ సమస్య ఉన్న మరొకరి ఎక్స్‌రేని ఇచ్చాడు. దాన్ని సర్దుబాటు చేయడానికి చాలా వేల సిరియన్ పౌండ్స్ ఖర్చయ్యాయి. సిరియాలో అంతర్యుద్ధంవల్ల అవినీతి, లంచగొండితనం బాగా పెరిగాయి, పాస్‌పోర్ట్ రిలీజ్ ఆర్డర్ని తీసుకుని బయటపడటానికి వారం అదనంగా పట్టింది. ఇంకోసారి నేను కాన్స్క్రిప్ట్ కాకుండా తను సహాయం చేయలేనని డాక్టర్ హెచ్చరించి పంపాడు."

"సారీ టు సే, కాని మీ నాన్నగారు మొండితనం మాని మీ అక్క దగ్గరకి వెళ్ళకపోతే నువ్వు ఇబ్బందుల్లో పడడం ఖాయం" చైత్ర చిరుకోపంగా చెప్పింది.

అతను బదులుగా నవ్వాడు తప్ప ఏం మాట్లాడలేదు.

"విత్ యువర్ పర్మిషన్ ఖాలెద్" చైత్ర కోరింది.

"గో ఎ హెడ్, వాటెవర్ ఇట్ మైట్ బి" అతను చెప్పాడు.

ఆమె తన చెల్లెలివైపు తిరిగి ఇంగ్లీషులో చెప్పింది.

"గాడ్ ఫర్బిడిట్. ఇతని సిరియన్ పాస్‌పోర్ట్ వల్ల అమెరికా ఇజ్రాయిల్‌లాంటి చాలా దేశాలకి రానివ్వరు. సిరియన్స్ మీద చాలా దేశాలు ఉగ్రవాదులుగా బేన్ పెట్టాయి. దాంతో మా కంపెనీ ఇతన్ని అవసరం ఉన్న అన్ని దేశాలకి బదిలీ చేయలేదు. సిరియన్స్‌ని అనుమతించే దేశాలకే బదిలీ చేయాలి. కాని అక్కడ ఇతని అవసరం ఉండాలి. ఏ కారణంగానైనా ఇప్పుడు ఇతని ఉద్యోగం ఊడితే ఇక ఘానాలో ఉండనివ్వరు. అతను ఆ సమయంలో ఏ దేశంలో పనిచేస్తుంటే ఆ దేశంలో ఉండనివ్వరు. పాస్‌పోర్ట్ ప్రకారం విధిగా తిరిగి తన స్వదేశానికి వెళ్ళాలి. అదే జరిగితే సిరియాలో ఆర్మీలో చేరకుండా ఎక్కువకాలం తప్పించుకోలేడు. వాళ్ళు యుద్ధంలో ఇప్పటికే చాలా సైన్యాన్ని పోగొట్టుకున్నారు. కాబట్టి వాళ్ళకి రిక్రూట్‌మెంట్ అవసరం ఉంది. ఇది ఇతని జీవితంలోని పెద్ద సమస్య."

"మైగాడ్!" ఆద్య వెంటనే అతని వంక ఆదుర్దాగా చూస్తూ చెప్పింది.

"ఆమె చెప్పింది నిజం" ఖాలెద్ నవ్వుతూ చెప్పాడు.

"నీకు సిరియన్ కాన్‌ఫ్లిక్ట్ గురించి తెలుసా?" చైత్ర చెల్లెల్ని అడిగింది.

ఆద్య తల అడ్డంగా ఊపింది. ఆమె టి.వి సీరియల్స్, తెలుగు సినిమాలు చూడటం తప్ప పేపర్ కూడా చదవదు. చదివినా తెలుగు దినపత్రికల్లో అమెరికాకి చెందిందే వార్త కాని సిరియా, సుడాన్‌లలో, లేదా ప్రపంచంలో ఏ ఇతర ప్రదేశాల్లో జరిగే ఏ వార్త కూడా ప్రధాన వార్త కాదు. అమెరికాలో ఆరుగురు మరణిస్తే వార్త. సిరియాలో ఆరువేలమంది మరణించినా అది తెలుగు దినపత్రికలకి వార్త కాదు.

"నా చెల్లెలికి సిరియన్ కాన్‌ఫ్లిక్ట్ గురించి తెలీదు. దయచేసి వివరిస్తావా? బై ది వే, రెస్టరెంట్‌కి ఫోన్ చేసి టేబుల్ రిజర్వ్ చేసావా?" చైత్ర అతన్ని అడిగింది.

"చేసాను."

"ఏ సమయానికి మనం అక్కడికి వెళ్ళాలి?"

"ఎనిమిదిన్నర."

"గుడ్. గెట్ గోయింగ్."

"లేప్‌టాప్ తెస్తానుండండి" చెప్పి వెళ్ళి తన పడకగదిలోంచి దాన్ని తెచ్చి ఆన్ చేసాడు.

"మీ అక్క నా గురించి ఎంత చెప్పిందో తెలీదు కాని నేను డమాస్కస్‌లోని హెల్బాన్ స్కూల్లో చదివాను. తర్వాత డమాస్కస్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్స్ చేసాను. నాకు ఇద్దరు అక్కలు. ఒకరిది అరేంజ్డ్ మేరేజ్. మరొకరిది లవ్ మేరేజ్. ఇద్దరూ జర్మనీలో ఉన్నారు. ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్‌లలో. నేను తొమ్మిదేళ్ళ క్రితం స్క్లంబర్జెలో చేరాను. పెళ్ళి, విడాకులు కూడా అయ్యాయి. ఇక సిరియా గురించి. సిరియాని ఓ విద్యార్థి తనకి తెలీకుండానే ఇబ్బందుల్లో పడేసాడు. అతని పేరు మావ్య సియాస్నే. మా ప్రెసిడెంట్ పేరు బషర్ ఆల్ అసాద్. ఇవి వారి ఫొటోలు. నేనుచెప్పేవన్నీ ఫొటోలు చూస్తే బాగా అర్థమవుతాయి..."

ఆద్య అతను చెప్పేది శ్రద్ధగా వినసాగింది.

"సిరియాలో సోషలిస్ట్ బాత్ పొలిటికల్ పార్టీ. 1963 నించి సిరియాని పాలించిన హఫిజ్ అసద్ దాన్ని టొటాలిటేరియన్ పోలీస్ స్టేట్‌గా మార్చి ఉక్కు పిడికిలితో పాలించాడు. ఇస్లాంని అధికారమతంగా తొలగించి, ముస్లిమేతరులు సిరియాని పాలించవచ్చనే సంస్కరణని తెచ్చాడు. దాంతో అలెప్పో, హమా, హమ్స్ నగర ప్రజల్లోని ముస్లిమ్స్ లో అసంతృప్తి ప్రబలి రేగిన తిరుగుబాటుని రహస్య పోలీస్ ఫోర్స్ హింసాత్మకంగా అణచివేసింది. హఫిజ్ అసాద్ లక్షలమంది సివిలియన్స్‌ని హత్య చేయించి, కొందరిని బలవంతంగా దేశంలోంచి పంపించేసాడు. సిరియన్

రాజ్యాంగాన్ని మార్చి ఒకే రాజకీయ పార్టీని ప్రతిపాదించి, ఇతర పార్టీలని చట్ట విరుద్ధం చేసాడు. తిరుగుబాటుదారులని, విమర్శకులని రహస్య పోలీస్ కఠినంగా శిక్షించసాగింది. ప్రతీ నియంతా తనని తాను ఆ దేశ ప్రజలని ఆదుకునేవాడిగా ప్రమోట్ చేసుకుంటాడు. 1976-1982 మధ్య 'సిరియన్ ముస్లిం బ్రదర్ హుడ్ ' హఫీజ్ అసాద్‌ని జాతిపితగా ప్రమోట్ చేసింది. ఆయన జులై 2000లో మరణించాక ఆయన కొడుకు ముప్పై ఐదేళ్ళ బషర్ అల్ అసాద్ అధికారంలోకి వచ్చాడు. సిరియాలోని ప్రజల్లో సున్నీల శాతం అధికం. షియాల శాతం తక్కువ. హఫీజ్ అసాద్ షియాకి చెందినవాడు. ప్రతిపక్షాల్లో అధికభాగం సున్నీలకి చెందినవారు."

"సున్నీ, షియాల మధ్య గల తేడా ఏమిటి?" ఆద్య అడిగింది.

"అది పధ్నాలుగు వందల ఏళ్ళ చరిత్ర. ఏడో శతాబ్దంలో స్థానిక ఎడారి తెగలని సంఘటితపరిచి ముస్లిం మతాన్ని స్థాపించిన మహమ్మద్‌కి కొడుకుల్లేరు. ఆయన తన వారసుడిని ప్రకటించకుండానే క్రీ.శ 632లో మరణించాడు. కొందరు ఆయన అల్లుడు ఆలీని వారసుడిగా గుర్తించారు. వారిది షియా తెగ. కాని ఎక్కువమంది మహమ్మద్ స్నేహితుడు హుస్సేన్ వారసుడికి మద్దతు ఇచ్చారు. దాంతో అతనే వారసుడయ్యాడు. అతని మద్దతుదారులు సున్నీలు. సున్నా అంటే సంప్రదాయమని అర్థం. అందులోంచి వచ్చింది సున్నీ. సున్నీలో మత పెద్దని కాలిఫ్ అంటే, షియాలో ఇమాం అంటారు. హుస్సేన్, అతని తర్వాత కాలిఫ్‌లైన ఇద్దరూ కూడా హత్యకి గురయ్యారు. మహమ్మద్ అల్లుడు ఆలీ నాలుగో కాలిఫ్ అయ్యాడు. ఆ రోజుల్లో ముస్లిం మతస్థులైన టరిబల్స్ కాలిఫ్‌కి కట్టే సుంకం పెద్ద మొత్తం. దాంతో అతను కాలిఫ్ అవాలనుకోవడం సహజం. 661లో అతనూ హత్యకి గురయ్యాక ఆలీ కొడుకు, మొహమ్మద్ మనవడు హుస్సేన్ తర్వాతి కాలిఫ్ అయ్యాడు. అతను కలాబా, అంటే నేటి ఇరాక్‌కి అక్కడి కాలిఫ్ అవినీతిని విచారించడానికి వెళితే 681లో సున్నీలు అతని తలని నరికారు. ఈ సంఘటన షియాని బలపరిచి, అది వారి సంప్రదాయంలో ఓ ఉత్సవమైంది.. బోర్ కొడుతున్నానా ఆద్యా?" ఖాలెద్ చెప్పడం ఆపి అనుమానంగా అడిగాడు.

"అబ్బే. లేదు. ఓ ప్రముఖ మతం గురించి తెలుసుకోవడంలో నాకు ఆసక్తి ఉంది" ఆద్య చెప్పింది.

"వందేళ్ళల్లో ముస్లిం సామ్రాజ్యం ఆసియాలోని ఎడారినించి యూరప్‌లోని స్పెయిన్‌దాకా విస్తరించింది. ఇరాన్, ఇరాక్, బెహరిన్, అజర్‌బైజాన్ దేశాల్లో షియాలే అధికం. మిగిలిన దాదాపు నలభై ముస్లిం దేశాల్లో, మొరాకోనించి ఇండోనేషియాదాకా సున్నీలే మెజారిటీ. నేడు ప్రపంచంలోని నూట అరవై కోట్లమంది ముస్లింలలో సున్నీలు ఎనభై ఐదు శాతమైంది. షియాలు పదిహేను శాతమంది మాత్రమే ఉన్నారు. ఇరవైవ శతాబ్దందాకా సున్నీలు, షియాలు కలిసి శాంతియుతంగా జీవించారు. ఆ తర్వాత ముస్లిం దేశాలమధ్య జరిగే యుద్ధాలు ప్రధానంగా సున్నీ, షియాలు మధ్య జరిగిన యుద్ధాలే. అఫ్‌కోర్స్. మిడిల్ ఈస్ట్‌లో ఆయిల్‌ని కనుగొన్నాక సంపదకోసం కూడా యుద్ధాలు జరిగాయి. ఇరవైయ్యవ శతాబ్దంలో ఇరాక్, సౌదీ అరేబియాల మధ్య జరిగిన యుద్ధం షియా, సున్నీల మధ్యే అని చెప్పాలి. ఇరాక్ మీద అమెరికా

దండయాత్ర చేసి ముస్లిం నాయకుడైన షియా తెగకి చెందిన సద్దాం హుస్సేన్ని చంపినా, పొరుగున ఉన్న ఇతర ముస్లిం రాజ్యాలు మిన్నకుండటానికి కారణం అవన్నీ సున్నీకి చెందినవే.

"మా సిరియాలో డెబ్బై నాలుగు శాతమ్మంది సున్నీలైతే షియాలు పదమూడు శాతమ్మందే. కాని దాన్ని నేడు పాలించే బషర్ అల్ అసాద్ షియా. సైన్యంలో కూడా షియాలే అధికం. తండ్రినించి రాజకీయ వారసుడైన ఆయన హింసాపూరిత పాలన, నిరుద్యోగం, ప్రభుత్వ సహకారం గల డమాస్కస్, అలెప్పోలోని కొందరే కోటీశ్వరులై, ఎనభై ఐదు శాతం ప్రజలు బీదగా కొనసాగడం, 2006 – 2011ల మధ్య వచ్చిన తీవ్ర క్షామం వల్ల ఆహారం లభ్యం కాకపోవడం, ఇరాక్ యుద్ధం వల్ల వచ్చిన పదిహేను లక్షలమంది కాందిశీకులు షియాలు అవడం, 1963నించి వాక్స్వాతంత్రం లేకపోవడం, ఐదుగురుమించి గుమిగూడకూడదన్న నియమం, రహస్య పోలీసులకి విచారణ లేకుండా అరెస్ట్ చేసే అధికారం, అరస్టైనవారు  మళ్ళీ కనపడకుండా మాయమవడం, మొదటినించీ సరైన తాగునీటి సరఫరా లేకపోవడం మొదలైన వాటివల్ల ప్రజల్లో అసాద్ మీద అసంతృప్తి ఏర్పడింది .

2010లో అసాద్ యూనివసిటీల్లో బురఖాలని నిషేధించి, దాన్ని పాటించని వేలకొద్దీ విద్యార్థులని డిబార్ చేసాడు. దాంతో డేరా, హామ్స్ నగరాల్లో ఛాందస ముస్లింల తిరుగుబాటు ఆరంభమైంది. ఇదంతా సిరియాలో తిరుగుబాటు ఎందుకొచ్చిందో మీకు అర్ధమవ్వాలని చెప్పిన నేపథ్యమే. అసలు కథ ఓ అనామక ప్రాముఖ్యత లేని విద్యార్థి చర్యతో ఆరంభమైంది."

అతను చెప్పేది అక్కచెల్లెళ్ళిద్దరూ ఆసక్తిగా వింటున్నారు.

"మావ్య సియాస్నే అనే ఏడో తరగతి విద్యార్థి అనుకోకుండా ఈ తిరుగుబాటుని ఆరంభించాడు. ఫిబ్రవరి 2011లో తన పధ్నాలుగో ఏట వాడు దారా నగరంలో తను చదివే స్కూల్ గోడలమీద ప్రభుత్వ వ్యతిరేక నినాదాలని రాసాడు. దాని ఫలితాలని అతను ఊహించలేదు. దాన్నించి పుట్టిన సివిల్ వార్వల్ల సిరియాలో వీధుల్లోని పోరాటాల్లో ఐదు లక్షలమంది మరణించారు. అది ఇతర దేశాలకి పాకింది. టునీషియా, ఈజిప్ట్, లిబియా, యెమెన్ ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని కోరుతూ నియంతలకి వ్యతిరేకంగా నినాదాలు చేసారు, అదో చారిత్రాత్మక సంఘటన.

"తర్వాతది నీవంతు అసాద్" అని సియాస్నే రాసింది చదివిన ముఖాబరత్, అంటే రహస్య పోలీసులు అతన్ని, మరో ముగ్గురు స్కూల్ విద్యార్థులని, ఓ డజనుమంది అనుమానితులని పట్టుకుని, నలభై ఐదు రోజులు బందిఖానాలో ఉంచారు. ఇది దారా నగర ప్రజలు భరించలేకపోయారు. తల్లితండ్రులు తమ పిల్లల్ని రక్షించుకోడానికి నిరసనకి దిగారు. పోలీసుల కస్టడీకి వెళ్ళిన వారేమయ్యారో తెలీక ప్రజలు నెల తర్వాత తిరుగుబాటు ప్రదర్శనలని నిర్వహించారు. మొదట్లో అవి శాంతియుతంగా జరిగాయి. 'మేమూ, సైనికులం ఒకరమే' అనే నినాదాలని వేలమంది దారా పౌరులు పలికారు. ఆ మధ్యాహ్నం మూడున్నరకి పోలీసులు రోడ్లమీద బారికేడ్లని ఏర్పాటు చేసి, టియర్ గేస్లు, వాటర్ కేనన్లని నిరసనకారుల

మీద ఉపయోగించారు. కాని ఎవరూ నిరసనల్లోంచి పారిపోలేదు. దాన్ని అణచివేయడానికి డమాస్కస్‌నించి హెలికాప్టర్‌లో స్పెషల్ ఫోర్సెస్‌ని రప్పించారు. సాయంత్రం నాలుగు తర్వాత వారు నిరసనదారుల మీదకి కాల్పులు జరిపారు. ఇది చూడండి" రూసియాస్కే అనే విద్యార్థి అల్ జజీరాకిచ్చిన ఇంటర్వ్యూని ఖాలెద్ లాప్‌టాప్‌లో ప్లే చేసాడు.

"మమ్మల్ని కొట్టారు. హింసించారు. చంపుతామని బెదిరించారు. కాళ్ళూ, చేతులు కలిపి కట్టి కోళ్ళల్లా వేలాడదీసారు. దాంతో భుజాల్లో భరించలేని నొప్పి. బాత్‌రూంలోకి తీసుకెళ్ళి షవర్ ఆన్ చేసి నిలబెట్టి వీపు మీద ఎలక్ట్రిక్ షాకులిచ్చారు. మేం తప్పు ఒప్పుకోవాలని పాదాలు నేలకి తాకకుండా ఓ రోజంతా గోడకున్న ఇనపచక్రాల్లో మణికట్లని దూర్చి వేలాడదీసారు" అతను చెప్పాడు.

"బాబోయ్!" ఆద్య అది విని చెప్పింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in